నూతన వధూవరులను ఆశీర్వదించిన హరీశ్‌రావు

అల్లిపూర్‌లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న హరీశ్‌రావు, రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 11: చిన్నకోడూరు మండలం అల్లిపూర్‌లో నూతన వధూవరులను మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కామ శ్రీనివాస్ సోదరి అఖిల-వంశీకృష్ణ, అదేవిధంగా గీకురు బాలయ్య కుమారుడు లంకేష్-లిఖితేశ్వరవాణి వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, సొసైటీ చైర్మన్ కనకరాజు, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా లీగల్ సర్వీసెస్

- న్యాయమూర్తి స్వాతిరెడ్డి

దివ్యాంగుల క్షేత్రంలో విద్యార్థులతో న్యాయమూర్తి స్వాతిరెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 11: దివ్యాంగుల సంస్థకు ఏ అవసరం ఉన్నా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎప్పుడూ సహకరిస్తుందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. మంగళవారం నాడామె పట్టణంలోని మనోచేతన దివ్యాంగుల క్షేత్రాన్ని సందర్శించారు. హాస్టల్ భోజన నాణ్యత, వంటగది పరిసరాలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు వైద్య సౌకర్యాలు సిబ్బంది ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలున్న వ్యక్తులను వేరుగా చూడొద్దన్నారు. పిల్లలకు ఏ సమస్య ఉన్న తెలియజేయటానికి జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ నుంచి ప్యానెల్ అడ్వకేట్, పారా లీగల్ వాలంటీర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. నేషన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మానసిక దివ్యాంగుల కోసం మనోన్యయ్ అనే న్యాయ సహాయ సేవ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇది మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలున్న వ్యక్తుల హక్కులను రక్షించడంతో సహాయపడుతుందన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్‌పర్సన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కె.సాయిరమాదేవి ఆదేశాల మేరకు ఈ క్షేత్రాన్ని సందర్శించినట్టు తెలిపారు. ఆమె వెంట కె.సాయిరమాదేవి, మనోచేతన రీహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు, న్యాయ సేవ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ పాలకవర్గం
- తరలిరానున్న భక్తజనం

రామాచల గుట్టపై రామలింగేశ్వర స్వామి ఆలయం

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 11: మండల కేంద్రమైన ధూళిమిట్టలోని బెక్కల్ శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో ఈనెల 12 నుంచి 26వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పార్నంది విశ్వనాథశర్మ, ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, అర్చకుడు సిద్దాపురం శివప్ప, ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. 12న మంగళవారం ఉదయం స్వామివారి మేలుకొలుపు, దిష్ఠికుంభం, ఏకాదశ రుగ్రాభిషేకం, సాయంత్రం బండ్ల సేవ, రాత్రి దేవుని పల్లకిసేవ, 17న స్వామివారికి గంగాస్నానం, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం, 22న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ప్రస్థాయం, బియ్యం సుంకు, భద్రకాళి అమ్మవారి ఆవాహన, పూజ కార్యక్రమం, 23న అగ్నిగుండ ప్రవేశం, 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని లింగోద్భవ సమయంలో రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మల్లన్నకు పెద్దపట్నం, బోనాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారని ఆలయ పాలక మండలి అంచనా వేస్తుంది. కాగా, భక్తుల కోరిన కోర్కెలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక వ్యాధులను నయం చేసే వైద్యనాథునిగా బెక్కంటి రామలింగ్వేర స్వామిని భక్తులు విశ్వసిస్తారు.

చెరువులకు నీటిని విడుదల చేయాలి

కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 11 : తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని 11 గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేయాలని కోరుతూ కొండపాక మండలంలోని మర్పడగ, రాంపల్లి రైతులు మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాస్‌పల్లి డీ4 కెనాల్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో మండల రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏమల్ల రాజిరెడ్డి, రాంపల్లి మాజీ సర్పంచ్ చిట్కుల సురేందర్‌రెడ్డి, మర్పడగ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చెల్లపురం కనకయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బాలనర్సయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పూచీకత్తు లేకుండా రుణాలు

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: చిరు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా తమ బ్యాంకు రుణాలు అందిస్తుందని యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వికాస్, డిప్యూటీ మేనేజర్ సంజయ్ చౌదరి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు తెలిపారు. సిద్దిపేట యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫైనాన్సియల్ లిటరసీ (ఎంఎస్‌ఎంఈ)పై మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతరహ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కనీస రుణ పరిధి రూ.50 లక్షల నుండి 5 కోట్లు వరకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా కేవలం పర్సనల్ గ్యారెంటీపైన రుణాలను అందిస్తున్నామన్నారు .వ్యాపారులు మంచి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అంతకు ముందు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి గుగులోత్ గోపి, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కల్యాణం జరుపుతున్న వేదపండితులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: సిద్దిపేట మార్కండేయ దేవాలయ 62వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణం, మృత్యుంజయ యాగం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ ప్రతినిధులు పురుషోత్తం, రాజేశం, బాలరాజు, శ్రీనివాస్, గణేష్, వేద పండితులు కృష్ణమూర్తి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కాళేశ్వరం జలాలు

- రంగనాయకసాగర్ కాలువ వెంట నడుచుకుంటూ రైతులతో సెల్ఫీ
- పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్
- నాటి బీఆర్‌ఎస్ సర్కార్ కృషి వల్లనే నేడు పొలాలకు గోదావరి జలాలు

జిల్లాలో గోదారమ్మ జల సవ్వడి.. కాల్వల వద్ద ఆనందంతో పరవశించిన హరీశ్‌రావు

రంగనాయకసాగర్ లెఫ్ట్ కెనాల్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు మండల నాయకులతో సెల్ఫీ తీసుకుంటున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 11: పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను చూసి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరవశించిపోయారు. మంగళవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయకసాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి ఆ సంతోషాన్ని రైతులతో పంచుకున్నారు. కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత మెట్‌పల్లి గ్రామంలోని కాలువ వెంబడి నడుచుకుంటూ వెళ్తూ పక్కనే ఉన్న పొద్దుతిరుగుడు తోటలను సందర్శించి సెల్ఫీ తీసుకున్నారు. అక్కడి రైతులతో ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు తాము మార్కెటింగ్ సమస్యలు, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను హరీశ్‌రావుకు వివరించారు.

పొద్దుతిరుగుడుకు మద్దతు ధర చెల్లించాలి

పొద్దుతిరుగుడు పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, ముందస్తు మార్కెట్ పరిస్థితుల సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లనే గోదావరి జలాలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం వల్లనే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని హరీశ్‌రావు చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని సంతోషం వ్యక్తంచేశారు. ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, సొసైటీ చైర్మన్ కనకరాజు, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుధవారం హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలలో ఉద్యోగ నియమాకాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో 50శాతం మార్కులు సాధించి 30 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైనవారికి రూ.18వేల వేతనం ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో కళాశాల పాత కాన్ఫరెన్స్ హాల్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 8106764653 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా

గజ్వేల్, ఫిబ్రవరి 11: ట్రాఫిక్ పోలీసుల వాహనాల తనిఖీలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షను విధిస్తూ మంగళవారం మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పునిచ్చినట్టు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. వాహనాల తనిఖీలో మద్యం సేవించి పట్టుబడిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, ఆరుగురికి రూ. 3,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కొమురవెల్లి, ఫిబ్రవరి 11: మండల కేంద్రమైన కొమురవెల్లిలో మంగళవారం మరో బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఆదివారం వీధికుక్కల దాడిలో ఇదే గ్రామానికి చెందిన బాలుడితో పాటు జాతరకు వచ్చిన మరో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. మంగళవారం దువ్వల మహన్ష్ అనే చిన్నారిపై వీధికుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కాగా రెండు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు వీధి కుక్కలు చిన్నారులపై దాడిచేసి గాయపరచడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

12న ఆత్మీయ సన్మానం

సిద్దిపేట, ఫిబ్రవరి 11: ఈనెల 12న ఎంఆఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మాదిగ జాగృతి సంఘం ఎంజేఎస్ జిల్లా కన్వీనర్ వేముల మల్లికార్జున్ మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం గత 30ఏళ్లుగా అహర్నిశలు పోరాటం చేసిన జిల్లాలోని మాదిగ నాయకులందరికీ ఈనెల 12న ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏంజెఎస్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ మంద బాబు, జిల్లా నాయకులు రాజన్ మహారాజు, దేవయ్య మహారాజ్, రవి బాబు మహారాజ్, బయ్యారం ఇస్తారి, భాస్కర్ మహారాజ్ పాల్గొన్నారు.

స్థానికంలో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

మద్దూరు: రేబర్తిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 11: రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తిలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కి వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు శివగారి అంజయ్య, పచ్చిమడ్ల మానస, మంచాల కొండయ్య, మాజీ ఎంపీపీ బెల్లపు యాదయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నలుసాని లింగారెడ్డి, మాజీ సర్పంచ్ అందె భూపతి, నాయకులు నల్ల బాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, బొద్దుల చంద్రమౌళి, గవ్వల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

జగదేవపూర్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని బీఆర్‌ఎస్ మండల నాయకులు దాచారం కనకయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అమలుకు నోచుకోని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నదాతలకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తుందని చేపట్టిన మహత్తర ప్రవేశపెట్టిన రైతుబంధు పథకానికి రేవంత్ తూట్లు పొడిచారని ఆరోపించారు. రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. ఒకవైపు పెట్టుబడి సాయం రైతుభరోసా రాక, మరోవైపు రుణమాఫీ చేయక పంటలు పండక ఎంతోమంది అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోతే గ్రామాల్లో తిరిగే కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కనకయ్య అన్నారు.

రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలి

- కలెక్టర్ మనుచౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11: ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లను బలోపేతం చేసి మిగతా ఎఫ్‌పీలకు ఒక మార్గదర్శకంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం సిద్దిపేట శివారులోని ఐటీ టవర్‌లో జిల్లాలోని పైలట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్న ప్రసిద్ధ, ప్రహర్ష ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న క్రిషి కల్ప అధికారులు, ఎఫ్‌పీఓల సీఈఓ, డైరెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో రైతులకు అవగాహన నిర్వహించి వారిని ప్రోత్సహించాలన్నారు. నిర్దేశించిన కాలంలోపు ఎఫ్‌పీఓలకు మార్కెటింగ్ విషయాలు పూర్తిగా తెలిపి వారిని బలోపేతం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్ విద్యార్థులకు మార్కెటింగ్ స్కిల్స్ నేర్పించి వాటిపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని క్రిషి కల్ప అధికారులకు తెలిపారు. సమావేశంలో డీఏఓ రాధిక, డీహెచ్‌ఓ సువర్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు అయోధ్యరెడ్డి, సెక్టోరియ్ అధికారి రామస్వామి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయొద్దు

సిద్దిపేట: మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేట, ఫిబ్రవరి 11: పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సమాచారం అందించాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నాడాయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సిబ్బంది ఆ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వార్డు ఆఫీసర్లు తమతమ వార్డుల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించాలన్నారు. నీటి సరఫరా, వీధిదీపాల సమస్య, ఇతర సమస్యలను సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇంటి, నీటి పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది బిల్ కలెక్టర్ సహాయంతో తప్పనిసరిగా వందశాతం పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్వో శ్రీకాంత్, యూడీఆర్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 11: మున్సిపల్ పరిధిలోని ఇంటి యాజమానులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి అధికారులకు సహకరించాలని కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో శానిటేషన్ పనులు, చెత్త సేకరణలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని పట్టణవాసులకు సూచించారు. 14వ వార్డులో తాగునీటి సరఫరా పైపు మరమ్మత్తు, 16వ వార్డుల్లో కాల్వర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉండాలి

చేర్యాల: ఆకునూరులో మాట్లాడుతున్న ఎస్ఐ నిరేష్

చేర్యాల, ఫిబ్రవరి 11: ఎన్నికల సమయంలో ప్రజలు కలిసి మెలిసి ఉండాలని ఎస్ఐ నిరేష్, ప్రొబిషనరీ ఎస్ఐ మానసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకునూరు గ్రామాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిరేష్, మానసరెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికలు వస్తూ పోతుంటాయని, వాటిని అడ్డు పెట్టుకుని గొడవలకు దిగవద్దని సూచించారు. ప్రజల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చాలా ముఖ్యమని, 24గంటలు సీసీ కెమెరాలు పనిచేయడం వల్ల ప్రజలకు ఎంతో రక్షణ ఉంటుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామప్రజలు తమకు సహకరించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాయపోల్, ఫిబ్రవరి 11: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట గ్రామాన్ని ఆయన సందర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎలాంటి గొడవలు లేకుండా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికలను అడ్డు పెట్టుకొని గొడవలకు దిగితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత రాకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 11: రానున్న వేసవిలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్, హుస్నాబాద్ మున్సిపల్ ప్రత్యేకాధికారి అబ్దుల్‌హమీద్ అధికారులకు సూచించారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి బావులు, బోర్లు సక్రమంగా పనిచేసేలా, మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అడ్డంకులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో వందశాతం ఆస్తి పన్ను వసూళ్లు చేయాలని, ప్రత్యేక దృష్టిసారించి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలన్నారు. వార్డు అధికారులు శానిటేషన్ విషయంపై శ్రద్ధను కనబరచాలని, అందరు సమన్వయంతో పనిచేస్తేనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు. హుస్నాబాద్ పట్టణం నక్ష ప్రాజెక్టుకు ఎంపికైందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, మేనేజర్ భూమానందం, ఆర్ఐ కనకయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

బైండోవర్ ఉల్లంఘనలో మహిళకు జరిమానా

తహసీల్దార్ ఎదుట మహిళను హాజరుపర్చిన ఎక్సైజ్ పోలీసులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 11: మండలంలోని కుందన్‌వానిపల్లికి చెందిన బానోతు సుగుణ అనే గిరిజన మహిళ బైండోవర్ ఉల్లంఘనలో అక్కన్నపేట తహసీల్దార్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు రూ. 50వేల జరిమానా విధించినట్లు మంగళవారం హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ మంగళవారం తెలిపారు. గతంలో సుగుణ గుడుంబా తయారు చేసి అమ్ముతూ పట్టుబడటంతో బైండోవర్ చేశామన్నారు. తిరిగి గుడుంబా అమ్ముతూ పట్టుబడగా అక్కన్నపేట తహసీల్దార్ ముందు బైండోవర్‌గా చేయగా, నిబంధనలు ఉల్లంఘించగా, జరిమానా విధించామన్నారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా గుడుంబా తయారీ, రవాణా, అమ్మకం చేసినా, బెల్లం, పటిక సరాఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటికి మారకపోతే పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

జగదేవపూర్, ఫిబ్రవరి 11: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సంజయ్ గుప్తా స్నాక్స్ అందించడం అభినందనీయమని ఆ కళాశాల ప్రిన్సిపల్ బానోతు రాజన్న తెలిపారు. మంగళవారం జగదేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడం నేపథ్యంలో సాయంత్రం స్టడీ అవర్ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేసినట్టు తెలిపారు. వీటిని విద్యార్థులకు అందించడానికి ముందుకు వచ్చిన భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సంజయ్ గుప్తాకు కళాశాల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించాలి

మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బెజ్జంకి, ఫిబ్రవరి 11: పోలీస్ సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సీసీ కెమెరాల అవశ్యకత గురించి ప్రజలు, వాణిజ్య సంస్థల యాజమానులను చైతన్యం చేయాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామానికో కానిస్టేబుల్ కేటాయించమని, పూర్తిగా గ్రామంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచి నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ శంకర్‌రావు, పోలీస్ కానిస్టేబుల్స్, సిబ్బంది ఉన్నారు. అలాగే గాగిల్లాపూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన 40 టన్నుల ఇసుకను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన సీపీఎం శ్రేణులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 11: అవినీతికి పాల్పడుతున్న మండలంలోని ఐనాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలరాజును సస్పెండ్ చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఐనాపూర్ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసవర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు తేలు ఇస్తారి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి బాలరాజు ఇటీవల కాలంలో గ్రామంలో వసూలు చేసిన పన్నులు ట్రెజరీలో జమ చేయకుండా వ్యక్తిగతంగా వాడుకున్నాడన్నారు. ఈ విషయమై గతంలో డీపీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి కానుగుల రాజు, సున్నం యాదగిరి, కర్రోళ్ల ఎల్లయ్య, గోరేమియా, శంకర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 11: ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు పట్టణంలోని శివాలయం వీధిలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆ ఆలయ కమిటీ మంగళారం తెలిపింది. 14న శ్రీవిష్ణు సహస్రనామపారాయణం, అఖండ దీపస్థాపన, 15న గోపూజ, యాగశాల ప్రవేశం, 16న మూలమంత్ర హోమం, 17న విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, స్వామివారి కళ్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.